బ్రహ్మోత్సవాలకు వేళాయె..

- 26 నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ ఉత్సవాలు
- ఐదురోజుల పాటు ప్రత్యేక పూజలు, గానవిభావరి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వేంకటగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 26 నుంచి మార్చి 2వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయ ధర్మకర్త కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏడాది ఐదురోజుల పాటు ఈ బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 28న శ్రీ వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి శ్రీవారి గానకైంకర్య దాసులు శ్రీ వేంకటాచలపతిచే అన్నమయ్య గానవిభావరి నిర్వహించనున్నారు. శ్రీ వేంకటగిరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఆమనగల్లు పట్టణంతో పాటు పరిసర మండలాల నుంచి ముఖ్యంగా హైదరాబాద్ నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్త కృష్ణమాచార్యులు కోరారు.

కార్యక్రమాల వివరాలు..

ఈనెల 26న సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, విశ్వక్సేన ఆరాధన, ప్రత్యేక పూజలు, 27న స్వామివారికి అభిషేకం, అగ్నిప్రతిష్ట, ధ్వజారోహనం, ఎదుర్కోల్లు, 28న ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, మహాభిషేకం, 11 గంటలకు శ్రీ వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణం, మార్చి 1న ఉదయం సుప్రభాతసేవ, అనంతరం రథోత్సవం, సాయంత్రం దోపోత్సవం, 2న సుప్రభాతసేవ, అర్చన, మంగళశాసనం, సుదర్శనహోమం, చక్రతీర్థం, పూర్ణాహుతి, అనంతరం శ్రీవారి బ్రహ్మోత్సవాల ముగింపు నిర్వహించనున్నారు.





వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు, (ఇన్‌సెట్‌లో) స్వామివారి మూలవిరాట్టు

రూ.కోటి పంట రుణాలు

- సకాలంలో రుణాలు చెల్లించాలి
- పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా

ఆమనగల్లు: ఆమనగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా ఈ ఏడాది రైతులకు రూ.కోటి వరకు పంట రుణాలు ఇవ్వాలనే లక్ష్యంగా నిర్ణయించినట్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా చెప్పారు. రుణాలను సకాలంలో చెల్లించి రాయితీ పొందాలని ఆయన సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో బుధవారం పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ గుప్త అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. సంఘం బలోపేతం, రైతులకు పంట రుణాలు, రుణాల రికవరీ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం గంప వెంకటేశ్‌గుప్తా మాట్లాడుతూ.. ఈ ఏడాది రైతులకు రూ.కోటి వరకు పంట రుణాలు అందించాలని లక్ష్యం కాగా ఇప్పటికే రూ.30 లక్షల రుణాలు రైతులకు అందించినట్లు చెప్పారు. రైతులు రుణాల కోసం దళారులను ఆశ్రయించకుండా నేరుగా పీఏసీఎస్‌లో సంప్రదించాలని, అర్హులైన వారందరికీ రుణాలు అందిస్తామని ఆయన వివరించారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా మరికొంతమంది రైతులకు రుణాలు అందించడానికి వీలుంటుందని ఆయన చెప్పారు. రైతులు తీసుకున్న రుణాలను ఈనెల 28లోపు రుణాలు చెల్లించే రైతులకు రాయితీ వలన కేవలం 4 శాతం వడ్డీ పడుతుందని ఆ తర్వాత చెల్లిస్తే 13శాతం వడ్డీ పడుతుందని తెలిపారు. మార్చి 31వ తేదీలోపు పాత బకాయిలు చెల్లించడానికి అవకాశం కల్పించినట్లు చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, డైరెక్టర్లు జోగు వీరయ్య, చేగూరి వెంకటేశ్, దోళ్యనాయక్, వెంకట్‌రెడ్డి, చెన్నమ్మ, జంగమ్మ, సీఈఓ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్‌గుప్తా

కొనసాగుతున్న నిరాహార దీక్ష

యాచారం: కొత్తపల్లి గ్రామస్తుల ప్రాణాలకు ప్రమాదకరంగా మారిన బొక్కల కంపెనీని మూసేయాలని గత 22 రోజులుగా గ్రామస్తులు నిరాహార దీక్షలు చేస్తున్నా అధికారులకు పట్టింపు లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. కొత్తపల్లి గ్రామస్తులు చేస్తున్న నిరాహార దీక్షకు బుధవారం ఆయన మద్దతు ప్రకటించారు. ఇన్నిరోజులుగా దీక్ష చేస్తున్నా ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేకు పట్టింపు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే బొక్కల కంపెనీని మూసేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి ఉప సర్పంచ్ జగన్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

రికార్డుల నమోదులో నిర్లక్ష్యం వద్దు: ఎంపీడీఓ



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

యాచారం: పంచాయతీల్లో రికార్డుల నమోదులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని గునుగల్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. రెండేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులు, చేసిన అభివృద్ధి పనులు, ఖర్చు చేసిన నిధుల వివరాలపై రికార్డులను తనిఖీలు చేశారు. పన్నుల వసూళ్లపై ఆరా తీశారు. రికార్డుల నమోదులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని వన నర్సరీలోని మొక్కలను పరిశీలించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి రాజేష్‌గౌడ్ ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీకాంత్

కడ్తాల్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు క్యామ శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన బాలుర వసతి గృహాన్ని ఏబీవీపీ నాయకులు బుధవారం పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. త్వరలోనే పరీక్షలు ఉండటంతో చదువుపై దృష్టి సారించాలని సూచించారు. వసతి గృహంలో ఏవైనా సమస్యలుంటే వసతిగృహ సంక్షేమ అధికారి దృష్టికి తీసుకువెళ్లాలని, అయినా పరిష్కరించకుంటే తమకు తెలిపితే పరిష్కారం అయ్యేవరకు ఆందోళన చేస్తామన్నారు. వసతి గృహ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలని వసతిగృహ సంక్షేమాధికారిని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు నరేందర్, మోహన్‌సింగ్ ఉన్నారు.

నేటి నుంచి ఉచిత వినికిడి పరీక్షలు


వనస్థలిపురం: వనస్థలిపురం పనామా డబుల్ రోడ్డులోని హియర్‌వెల్ స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్ వద్ద ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా కన్సల్టేషన్, వినికిడి స్క్రీనింగ్ పరీక్షలు, చెవి మిషన్ ట్రయల్ ఉచితంగా నిర్వహిస్తామన్నారు. వివరాలకు ఫోన్స్: 97032 35513, 99856 31926లలో సంప్రదించాలని సూచించారు.

త్వరలో జీఓ 118 సవరణ

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీవాసులు ఎదుర్కొంటున్న నోటరీ, ఖాళీ ప్లాట్ల రిజిస్ట్రేషన్ సమస్యలను త్వరలో జీఓ 118 సవరణ ద్వారా పరిష్కరించనున్నామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్‌ను కలిసి నోటరీ, ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్‌కు ఉన్న అడ్డంకులను వివరించి జీఓ 118 సవరణ ఆవశ్యకతను వివరించారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఇటీవల ప్రత్యేక చొరవతో 118 జీఓ ద్వార ఇండ్ల రిజిస్ట్రేషన్ సమస్యకు వెసులుబాటు కల్పించారని... జీఓ సవరణ ద్వారా ఓపెన్, నోటరీ ప్లాట్లతో పాటు ఇండ్ల కొనుగోలుదారులకు కూడా రిజిస్ట్రేషన్ అడ్డంకులు తొలుగుతాయని స్పష్టం చేశారు. విదేశాలలో ఉన్న వారు కూడా ఆన్‌లైన్‌లో, చట్టపరంగా హక్కు కలిగిన ప్లాట్ల యజమానుల బంధువుల వ్యక్తిగత పూచీతో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలుగా జీఓ సవరణలో ఆప్షన్ కల్పించాల్సిందిగా నవీన్ మిట్టల్‌ను కోరామన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాత

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. బుధవారం భూపేశ్‌గుప్తానగర్‌కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారగోని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి కార్పొరేటర్ కాలనీలో మార్నింగ్ వాక్ చేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాలను తొలగించి వాటిస్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని, కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాలని కోరారు. స్పందించిన కార్పొరేటర్ సుజాతనాయక్ అన్ని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వేణుగోపాలచారి, జిలాని, యూనిస్, వహీద్, రమేశ్‌బాబు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన కోసికే మల్లయ్యకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.40 వేలు మంజూరయ్యాయి. బుధవారం మండల కేంద్రంలో బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త, ఉప సర్పంచ్ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

నిరుపేదలకు వరం..

మాడ్గుల: సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరమని ఎమ్మెల్సీ కసిరెడ్డి అన్నారు. మండలంలోని నల్లవారిపల్లికి చెందిన నిట్టజంగయ్య, మల్లమ్మ, ప్రేమలతలకు మంజూరైన రూ.1.80లక్షల సీఆర్‌ఎంఆర్‌ఎఫ్ చెక్కు అదేవిధంగా కొల్కులపల్లికి చెందిన సుక్కపందుల జంగయ్యకు రూ.30 వేలు, ఎస్.వెంకటయ్యకు రూ.38 వేలు, మాడ్గులకు చెందిన పి.జంగయ్యకు రూ.29 వేలు చెక్కులను లబ్ధిదారులకు మాడ్గులలో బుధవారం ఎమ్మెల్సీ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్‌బాలాజీసింగ్, నాయకులు సూదిని కొండల్‌రెడ్డి, మస్న విష్ణు, పల్లె జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వేతన సవరణ చేపట్టండి



అబ్దుల్లాపూర్‌మెట్: సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సర్కిల్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్ కార్మికులకు ధర్నా

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్రంలోని విద్యుత్ ఉద్యోగులు మరియు ఆర్టిజన్ కార్మికుల 29 డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్–82 ఆధ్వర్యంలో బుధవారం సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ఆర్టిజన్ కార్మికుల వేతన సవరణ చేపట్టడటంతో పాటు పీఆర్‌సీని వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అపరిష్కృతంగా ఉన్న 29 డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ నాయకులు ఉపేందర్, శ్రీకాంత్‌రెడ్డి, పెద్దులు, శివారెడ్డి, రాజు, శ్రావణ్, జయసుధన్‌రెడ్డి, ప్రవీణ్, హరీశ్వర్‌రెడ్డి, మహేందర్‌రావు, హెచ్–82 నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి..

మంచాల: విద్యుత్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ డివిజన్ నాయకుడు పి.రాజు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్టిజన్ కార్మికుల 29 డిమాండ్లను పరిష్కరించాలన్నారు. చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించక పోతే ఉద్యమం ఉధృతం చేస్తామని అన్నారు.

యథేచ్ఛగా చెత్త కాల్చివేత

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ అధ్వానంగా తయారైంది. పలు కాలనీలలో రోడ్ల వెంబడి చెత్త కుప్పలు పేరుకు పోతున్నాయి. చెత్తను సకాలంలో డంపింగ్ యార్డుకు తరలించాల్సిన సిబ్బంది ఆయా చెత్త కుప్పలకు నిప్పు పెడుతూ కాలనీలలో పొగబెడుతున్నారు. చెత్తను యథేచ్ఛగా కాలుస్తుండటంతో కాలనీలలో కాలుష్యం పెరిగిపోతోందంటూ ప్రజలు వాపోతున్నారు. చెత్తను కాల్చకుండా చూడాల్సిన శానిటేషన్ అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదంటూ వివిధ కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్తను కాల్చడం వల్ల వచ్చే పొగ, కాలుష్యంతో తాము ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పారిశుద్ధ్య కార్మికులు చెత్తను కాల్చకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పుట్టినగడ్డ రుణం తీర్చుకుంటా

- మీ ఆశీర్వాదంతోనే మూడుసార్లు ఎమ్మెల్యేనయ్యా
- ఎల్మినేడు సభలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి భావోద్వేగం



ఎల్మినేడు సభలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, నేతలు

ఇబ్రహీంపట్నం రూరల్: మామూలు వ్యాపారిగా ఉన్న నన్ను రాజకీయ నాయకుడిగా భిక్ష పెట్టిన ఎలిమినేడు ప్రజలను గుండెల్లో పెట్టుకుంటానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర మంగళవారం రాత్రి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సొంత గ్రామం ఎల్మినేడుకు చేరుకుంది. స్వగ్రామంలో మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డికి గ్రామస్తులు రాజకీయాలకు అతీతంగా ఘనస్వాగతం పలికారు. గ్రామంలో గడపగడపకు తిరిగి గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. సొంత గ్రామానికి ఏమి చేశానని ఏనాడు చెప్పుకోలేదన్నారు. గడిచిన ఎనిమిది సంవత్సరాలల్లో ఎల్మినేడులో రూ.65 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఎల్మినేడు గ్రామంలో భవిష్యత్‌లో పెద్ద పరిశ్రమలు వస్తాయని తెలిపారు. భూములు కోల్పోయిన ప్రతి ఇంటికి ఉద్యోగం ఇప్పించే బాధ్యత నాదేనన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడానికి మీరే పునాది అన్నారు. భవిష్యత్‌లో ఎల్మినేడును మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.

తల్లి, కూతురి పుట్టినరోజు వేడుకలు..

స్వగ్రామానికి పాదయాత్ర చేరుకున్న సందర్భంగా గ్రామంలో అదేరోజు తల్లి ముకుందమ్మ, అతడి చిన్నకూతురు మనస్వీ పుట్టినరోజు ఒకేరోజు కావడంతో వేడుకలు జరుపుకున్నారు. గత 30 రోజులుగా కుటుంబ సభ్యులను వదిలి ప్రజల కోసం పాదయాత్ర చేస్తున్నానని అన్నారు. సొంత గ్రామంలో ప్రజలందరిని చూసి భావోద్వేగానికి గురయ్యాడు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్, వైస్ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ ఎడ్మా ఆశోకవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాములు, పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ మార్తా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు .



ప్రశాంత్‌కుమార్‌రెడ్డికి వీరతిలకం దిద్ది స్వాగతం పలుకుతున్న మహిళలు

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని మాదాయిపల్లికి చెందిన చెన్నయ్య (55) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.3000 ఆర్థిక సహాయం అందజేశారు. నిరుపేదలకు అండగా ఉంటామన్నారు. ఉప సర్పంచ్ జయమ్మ, శ్రీనివాస్, యాదయ్య, భగవంతు, అంజయ్య, సత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి చేయూత..

తలకొండపల్లి: మండల పరిధిలోని జంగారెడ్డిపల్లికి చెందిన తల్లిదండ్రులు లేని స్వప్న పెళ్లి జరుప నిశ్చయించారు. వివాహ ఖర్చులకు డబ్బులు లేక బంధువులు.. స్థానిక నాయకుల సహకారంతో జెడ్పీటీసీ వెంకటేశ్‌ను కలిసి పెళ్లి ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. స్పందించిన జెడ్పీటీసీ వెంకటేశ్.. స్వప్న పెళ్లికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా బుధవారం రూ.15,000 అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో హనుమాన్ దేవాలయ వైస్ చైర్మన్ ఆంజనేయులుగౌడ్, మాజీ ఉప సర్పంచ్ మల్లేశ్, వార్డు సభ్యులు విటల్, బుచ్చిబాబు, రమేష్, దశరథం, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

జీపీల అభివృద్ధికి సొంత నిధులు కీలకం

ఉప సర్పంచ్ అనిల్

తలకొండపల్లి: గ్రామ పంచాయతీల ఆదాయ వనరుల సమీకరణపై పూర్తిస్థాయిలో అవగాహన పొందామని ఉపసర్పంచ్ అనిల్ అన్నారు. జీపీల అభివృద్ధికి సొంత నిధులు కీలకమన్నారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ ఎక్స్‌టెన్షన్ శిక్షణా కేంద్రంలో తెలంగాణ అభివృద్ధి–పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలు సొంత ఆదాయ వనరుల సమీకరణ అనే అంశంపై రాష్ట్ర స్థాయిలో ఎంపికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లకు ఇటీవల 5 రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణకు మండల కేంద్రానికి చెందిన ఉప సర్పంచ్ అనిల్ ఎన్నికయ్యారు. ఈ మేరకు సీఈఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్‌చే శిక్షణ పొందినట్లు సర్టిఫికెట్ తీసుకుంటున్నట్లు అనిల్ బుధవారం తెలిపారు. ఈశిక్షణ కార్యక్రమం రెండు సంవత్సరాల ముందు నిర్వహించినట్లైతే పంచాయతీలు మరింత అభివృద్ధి చెందడానికిఅవకాశముండేదని తెలిపారు. శిక్షణలో చాలా నేర్చుకున్నామన్నారు.



సర్టిఫికెట్ అందుకుంటున్న ఉపసర్పంచ్ అనిల్

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి

సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి



విద్యార్థులను సన్మానించిన సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి

మంచాల: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో ఎంబీబీయస్ పూర్తిచేసి డాక్టరేట్ పట్టా పొందిన మహ్మద్‌ఆలియా సుల్తానా, పోలేపల్లి సిదార్థ అనే విద్యార్థులను గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు. చదువుకు పేదరికం అడ్డు కాదన్నారు. కష్టపడి చదువుకోవాలన్నారు. ఆరుట్ల గ్రామం నుంచి విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పొందాల జంగయ్య గౌడ్, ఎంపీటీసీ సభ్యులు కావలి శ్రీనివాస్, చీరాల రమేష్, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: కంటి సమస్యలతో బాధపడేవారు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని అన్నారు. వైద్యులే గ్రామాల్లోకి వచ్చి అత్యాధునిక పరికరాలతో కంటి పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయించేందుకు రిఫర్ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, ఉప సర్పంచ్ రామకృష్ణ, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు లాయక్‌అలీ, శ్రీనివాస్‌గుప్త, సర్పంచ్ తులసీరాం, వార్డు సభ్యులు, నాయకులు నర్సింహ, నరేందర్‌రెడ్డి, మల్లయ్య, భిక్షపతి, మహేశ్, రాంచందర్, భాస్కర్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, వైద్యులు కిరణ్‌కుమార్, హెచ్‌ఈఓ సుదీర్, సిబ్బంది ఉన్నారు.



కడ్తాల్: మహిళకు కళ్లద్దాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

పోలెపల్లి గ్రామంలో..

ఆమనగల్లు: ఆమనగల్లు మండలంలో కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతుంది. మండల పరిధిలోని పోలెపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కంటివెలుగు శిబిరంలో 118 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బల్‌రాం, ఉపసర్పంచ్ అంజన్‌రెడ్డి, ఎంపీటీసీ కుమార్, డాక్టర్లు పరిక్షిత్ నరేందర్, మంజులాదేవి, సిబ్బంది తిరుపతిరెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

386 మందికి పరీక్షలు..

తలకొండపల్లి: మండల పరిధిలోని చౌదర్‌పల్లి, హర్యానాయక్‌తండాలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరంలో బుధవారం 386 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు కల్పన, స్నేహ, సైదమ్మ, మల్లికార్జున్, హెచ్‌ఏ మల్లయ్య, రామచంద్రయ్య, నర్సింహ, రవి కుమార్, శివకుమార్, నాగమల్లీశ్వరి ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

మంచాల: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్యారెడ్డి అన్నారు. బుధవారం మంచాల మండల పరిధిలోని నోముల గ్రామంలో నిర్వహించిన శ్రీ మల్లికార్జున స్వామి రథోత్సవానికి ఆమె హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీటీసీ సభ్యుడు జయానందం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో..

కడ్తాల్: మండల పరిధిలోని చరికొండ గ్రామంలోని శ్రీవేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసచారి, కిరణ్‌చారి, వేణుచారి, రామయ్యచారి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో..

తలకొండపల్లి: మండల పరిధిలోని చెన్నారంలోని హనుమాన్ దేవాలయ బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్నా, భాస్కర్‌రెడ్డి, రమేష్‌నాయక్, రాజునాయక్, చందూ, మల్యానాయక్, రాజు, అశోక్ పాల్గొన్నారు.



మంచాల: రథోత్సవంలో జెడ్పీటీసీ సభ్యురాలు నిత్యారెడ్డి తదితరులు